సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం। 6। జనవరి। 2023



సొంత స్థలమిచ్చి..

మూలిపాడు సర్పంచ్ తన సొంత స్థలాన్ని దానం చేశారు. ప్రభుత్వ భవన నిర్మాణం కోసం దానమిచ్చారు. -8లో



అట్టహాసంగా క్రీడాపోటీలు

పాలిటెక్నిక్ క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పది కాలేజీల విద్యార్థులు హాజరయ్యారు. -8లో

అంగన్‌వాడీ కేంద్రంలో ఎలుగు హల్‌చల్

సోంపేట: మండలంలోని మామిడి పల్లి గ్రా మంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం రాత్రి ఎలుగు బంటి హల్ చల్ చేసినట్లు స్థానికులు తెలిపారు. కేంద్రంలోని పౌష్టికాహారాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి ఎలుగులు బారినుంచి స్థానికులను కాపాడాలని సర్పంచ్ పాతిన శేషగిరి కోరారు.

యోధులు వీరు.. గాధలు చూడు



అవార్డు అందుకున్న ఆశిష్



- యోగాలో రాణిస్తున్న సిక్కోలు రత్నాలు
- జాతీయ స్థాయిలో మెరుపులు

అందరి వయసు 20లోపే. ఖ్యాతి మాత్రం దేశాంతరాలను తాకుతోంది. అందరూ సామాన్య కుటుంబాలకు చెందిన వారే. ఎంచుకున్న దారి వారిని ప్రత్యేకంగా నిల బెడుతోంది. వారికి ఆసనం ఆరోగ్యమే కాదు అవార్డులనూ తెచ్చి పెడుతోంది. ఒంటిని విల్లిలా వంచి చేస్తున్న విన్యాసాలకు పతకాలు వచ్చి వాలుతున్నాయి. వారు యోగాను నమ్ముకుంటే.. అదృష్ట యోగం వారిని వరిస్తోంది. చిరుస్థాయిలో ప్రారంభించి శిఖర స్థాయి దిశగా వారి ప్రయాణం సాగుతోంది.

170 సెకన్లలో 27 ఆసనాలు..

ఆసనాలతో ఆశిష్

వయసు పదేళ్లు. కానీ ఈ పిల్లాడి విన్యాసాలను చూస్తే ఒళ్లు జలదరించకమానదు. పదేళ్లకే ప్రపంచ బుక్‌లో తన పేరును లిఖించుకున్నాడు పలాసకు చెందిన సంపతిరావు ఆశిష్. పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో ఐదో తరగతి చదువుతున్న ఆశిష్ చిరు ప్రాయంలోనే యోగాను వంటబట్టించుకున్నాడు. వసతి గృహంలో వేకువజామున లేచి వ్యాయామంతో పాటు కిరణ్ అనే కోచ్ వద్ద ఆసనాలు వేయడం నేర్చుకున్నాడు. ఆసనాల పై ఆసక్తి పెరగడంతో అతనికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తోంది. టెక్కలి మండలం బలరాంపు రం గ్రామానికి చెందిన సంపతిరావు మోహన్‌బాబు, అమ్మాజీలు బాలుడి తల్లిదండ్రులు. పాల్గొన్న ప్రతి పోటీలోనూ పతకాలను కైవసం చేసుకోవడం ఆశిష్ ప్రత్యేకత. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయిలో 650 మంది చిన్నారుల్లోఅండర్- 14లో టాప్ టెన్‌లో నిలిచాడు. శ్రీకాకుళం జిల్లాలో స్కూల్ గేమ్స్‌లో యోగా విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. రెండు నిమిషాల 50 సెకన్లలో 27 ఆసనాలు వేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఇందుకు గాను భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుతో పాటు మరో రెండు పుస్తకాల్లో పేరు నమోదు చేసుకున్నాడు. నటనలో రాణించడంతో శ్రీశ్రీ కళా వేదిక నుంచి బాలరత్నఅవార్డు అందుకున్నాడు.

కాశీబుగ్గ

జాతీయ స్థాయికి..





యోగాసనాలు వేస్తున్న జి. లోకేశ్వరి


జాడుపూడిలోని కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న గున్న లోకేశ్వరి యోగాలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23, 24 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచి, గోల్డ్‌మెడల్‌ను సాధించింది. దీంతో జాతీయస్థాయి పోటీల్లో ఆడేందుకు అర్హత సాధించింది. 2018 సంవత్సరంలో జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ పోటీల్లో నిర్వహించిన యోగాసనాల పోటీల్లో పాల్గొంది. అప్పట్లో జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. తర్వాత కరోనా సీజన్ ప్రారంభం కావడంతో ఆ రెండేళ్లు ఎలాంటి పోటీలు నిర్వహించకపోవడంతో రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం లేకపోయింది. అయినా ప్రాక్టీస్ మరువలేదు. మళ్లీ ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో పాల్గొని తన ప్రతిభను కనబర్చింది. మందస మండలం భైరిసా రంగపురం గ్రామానికి చెందిన లోకేశ్వరి తల్లిదండ్రులు బాలరాజు, వాణిలు రోజువారీ కూలీలు. సామాన్య నేపథ్యమే అయినా తన ప్రయాణాన్ని ఆమె అసామాన్యంగా మార్చుకుంది. టెన్త్‌లో కూడా 600లకు గాను 532 మార్కులు సాధించింది. ఈమె ఉత్సాహానికి తగ్గట్టుగా పాఠశాల పీఈటీ పిట్ట మహాలక్ష్మి కూడా తర్ఫీదునిస్తున్నారు.

-కంచిలి

ప్రతిభ ఉంటే పేదరికం అడ్డుకాదు..



యోగాసనాలు వేస్తున్న అవినాష్



ప్రతిభ ఉన్నోడికి పేదరికం అడ్డు కాదని నిరూపిస్తున్నాడు ఎల్.ఎన్.పేట మండలం రావిచెంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రంగాల అవినాష్. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయిలో యోగాలో ప్రథమ స్థానంలో నిలిచి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రాయవరంలో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి తృతీయ స్థానంలో నిలిచాడు. సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రంగాల అవినాష్ అమ్మ గీత, నాన్న గాంధీ ఇద్దరు వలస కూలీలే. వీరిద్దరు చెన్నై వంటి పట్టణాలకు భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేసేందుకు వెళతారు. ఈ క్రమంలో అవినాష్‌ను తాత చంద్రయ్య ఇంటి వద్ద చదివిస్తున్నారు. 2019లో పదోన్నతితో కూడిన బదిలీపై రావిచెంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చిన పీడీ పిల్లా రమణమ్మ అవినాష్ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. అప్పటి నుంచి అవినాష్ రాటుదేలాడు. జాతీయ స్థాయిలో నిలవాలన్నదే తన ధ్యేయమని విద్యార్థి చెబుతున్నాడు.

- ఎల్.ఎన్.పేట

న్యూస్‌రీల్

జిల్లావ్యాప్తంగా 30 పోలీసు చట్టం అమలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా వ్యాప్తంగా ఏపీ 30 పోలీసు చట్టం అమలులో ఉందని, ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, గుంపులుగా ఏర్పడటం, ర్యాలీలు ఏర్పాటు చేస్తే చట్టాన్ని ఉల్లంఘించిన నేరం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జీఆర్ రాధిక ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీలు ఏవైనా సరే సంబంధిత ప్రాంతంలో ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు అక్కడి పోలీసు అధికారులను సంప్రదించి అనుమతి తీసుకోవాలని సూచించారు.

శ్రీముఖలింగేశ్వరుని బంగారు, వెండి ఆభరణాలు తూకం



స్వామివారి ఆభరణాలు లెక్కిస్తున్న అధికారులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని బంగారు, వెండి ఆభరణాలు తూకం వేసి ఆలయ అధికారులకు అప్పచెప్పినట్లు జ్యూలరీ వెరిఫికేషన్ అబ్జర్వర్ అధికారి(రాజమండ్రి) ఏవీ దుర్గాభవాని తెలిపారు. ఆమె గురువారం దేవదాయ శాఖ అధికారులు, అర్చకుల సమక్షంలో స్వామి ఆభరణాలను పరిశీలించి తూకం వేసి లెక్కించారు. అంతకు ముందు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ పి.ప్రభకరరావు,సిబ్బంది ఉన్నారు.

'రాజీ పడదగ్గ కేసులు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ చేయటానికి ముందుకు రావాలని, రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన కోర్టు హాల్‌లో గురువారం పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11న లోక్ అదాలత్ నిర్వహిస్తామని, ఇందులో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. మానసికంగానూ ప్రశాంతత లభిస్తుందని సూచించారు.

30 నుంచి కమ్మసిగడాం జాతర



జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

రణస్థలం: ఉత్తరాంధ్ర కల్పవల్లి కమ్మసిగడాం శ్రీమహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వర రావు అన్నారు. మండలంలోని కమ్మసిగడాం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి కల్యాణం, జాతరలో దుకాణాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వి.తేజ, వి.రాజశేఖర్, మన్నె లక్ష్మీ ప్రసాద్, వెలిచేటి ఫల్గుణరావు ఉన్నారు.

8న జానపద కళాజాత

పలాస: పలాస మండలం రంగోయి గ్రామంలో ఈ నెల 8న నిర్వహించనున్న జానపద కళాజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పలాస సూదికొండలో డప్పు కళాకారులతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల డప్పు కళాకారుల అధ్యక్షుడు తోట శిమ్మయ్య, కె.గణేష్, బి.రామారావు, ఆర్. సోమేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థినులను ఇళ్లకు పంపించేందుకు 11 బస్సులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థినులను సురక్షితంగా ఇళ్లకు పంపించే చర్యలు అధికారులు చేపడుతున్నారు. ఏడో తేదీ నుంచి ఈ నెల 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించగా, విద్యార్థినులు ముందుగానే ఇళ్లకు చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో 11 ఆర్టీసీ బస్సులను ప్రస్తుత ధరల మేరకు అద్దెకు తీసుకున్నారు. పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల విద్యార్థులు ఈ బస్సుల్లో సొంతూళ్లకు ప్రయాణమవుతున్నారు. తల్లిదండ్రుల సూచనల మేరకు విద్యార్థినులను సురక్షితంగా పంపిస్తున్నామని పరిపాలన అధికారి ఎం.సత్యనారాయణ తెలిపారు.



ఇళ్లకు బయల్దేరిన విద్యార్థులు

27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గార: శ్రీకూర్మం గ్రామంలో సింహాద్రి నాగమణి ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ బి.రామారావుతో పాటు సిబ్బంది దాడులు జరిపి బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ దాడుల్లో రెవెన్యూ పరిశీలకులు ఆర్ అప్పలరాజు. వీఆర్ఐ జగదీశ్వరరావు, ఈశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బియ్యంను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలో ఓటర్ల సంఖ్య 18,26,018

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో భాగంగా తుది ఓటర్ల జాబితా-2023ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ గురువారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా-2023ను విడుదల చేసేందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఇంకా ఎవరైనా ఉంటే ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18,26,018 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో 2,342 పోలింగ్ స్టేషన్లు ఉండగా 9,09,559 మంది పురుష ఓటర్లు, 9,16,257 మంది మహిళా ఓటర్లు, 202 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు.

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 295 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,27,127 మంది పురుష ఓటర్లు, 1,32,564 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 21 మంది ఉన్నట్లు తెలిపారు.
- పలాస నియోజకవర్గంలో 278 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,03,350 మంది పురుష ఓటర్లు, 1,06,785 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 42 మంది ఉన్నారు.
- టెక్కలి నియోజకవర్గంలో 316 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,17,860 మంది పురుష ఓటర్లు, 1,16,728 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 18 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.
- పాతపట్నం నియోజకవర్గంలో 316 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,12,588 మంది పురుష ఓటర్లు, 1,12,060 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 17 మంది ఉన్నట్లు చెప్పారు.
- శ్రీకాకుళం నియోజకవర్గంలో 279 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,30,814 మంది పురుష ఓటర్లు, 1,32,181 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 39 మంది ఉన్నారని..
- ఆమదాలవలస నియోజకవర్గంలో 259 పోలింగ్ స్టేషన్లు ఉండగా 94,246 మంది పురుష ఓటర్లు, 95,038 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 23 మంది ఉన్నారు.
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో 309 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,20,467 మంది పురుష ఓటర్లు, 1,17,507 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 25 మంది ఉన్నారని తెలిపారు.
- నరసన్నపేట నియోజకవర్గంలో 290 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,03,107 మంది పురుష ఓటర్లు, 1,03,394 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 17 మంది ఉన్నట్లు వివరించారు.
- 2023లో 18-19 వయసు గల యువత 16,003 మంది ఎలక్టోరల్స్‌గా నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.



మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోరుకు సిద్ధం

- 8న శ్రీకాకుళం ఇండోర్ స్టేడియం వేదికగా జిల్లాస్థాయి పోటీలు
- ఇక్కడ రాణిస్తే రాష్ట్రపోటీలకు నేరుగా ఎంపిక



పోటీలకు ఆతిథ్యమిస్తున్న శ్రీకాకుళం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ఇదే



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 8న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియం వేదిక గా ఈ పోటీలు జరగనున్నాయి. జిల్లాలో ఏడాదిపాటు శిక్షణ పొందుతున్న మాస్టర్స్ (35ఏళ్లు పైబడిన) బ్యాడ్మింటన్ క్రీడాకారులకు శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ తీపికబురు అందించింది. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారుల ను నేరుగా రాష్ట్రపోటీలకు పంపించనున్నారు. టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జిల్లాకు చెంది, 35 ఏళ్లు పైబడినవారంతా పాల్గొనవచ్చు. మొత్తం 9 వయో విభాగాల్లో ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు.

మొత్తం 5 కేటగిరీల్లో పోటీలు..

మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలను పురుషులకు, మహిళలకు కలిపి మొత్తం 5 కేటగిరిల్లో నిర్వహించాలని నిర్ణయించారు. పురుషులకు సింగిల్స్, డబుల్స్, మహిళలకు సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు వేర్వేరుగా నిర్వహించనుండగా ఇద్దరికీ మిక్స్‌డ్ డబుల్స్‌లో తొలిసారిగా పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలకు హాజరయ్యే మాస్టర్ షట్లర్స్‌కు వసతి, భోజనం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఇక్కడ రాణిస్తే రాష్ట్రపోటీలకు ఎంపిక

ఇక్కడ విజేతలుగా నిలిచిన మాస్టర్స్‌ను ఫిబ్రవరి 2 నుంచి 5వ తేదీ వరకు ప్రొద్దుటూరు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు పంపించనున్నట్లు శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్ తెలిపారు. మాస్టర్ షట్లర్స్ ఈనెల 7వ తేదీ రాత్రి 9గంటల్లోగా తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని, రూ.400 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. మరిన్ని వివరాలకు, ఎంట్రీల నమోదుకు 9440255255(సంపతిరావు సూరిబాబు), 9440413199 (అశోక్) నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

విజయవంతం చేయాలి..



శ్రీకాకుళం వేదికగా జరిగే జిల్లా మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఇక్కడ రాణిస్తే రాష్ట్రపోటీలకు ఎంపికవుతారు. అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ మీట్‌కు హాజరవుతున్న మాస్టర్స్ క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నాం. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.

– కిల్లంశెట్టి సాగర్, బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కొమ్మ ఉయ్యాలా.. కొంగ జంపాలా



మోడువారిన చెట్టుకు కొంగలు కుసుమాలై కనిపిస్తున్నాయి. శ్రీకాకుళం జాతీయ రహదారి సింగుపురం రోడ్డు వద్ద చెట్టుపై కొంగలు వాలి కనువిందు చేశాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

హారతి వెలుగులో అత్రి పుత్రుడు

అత్రి మహర్షి పుత్రుడు దత్తాత్రేయుడు హారతి వెలుగులో దివ్యమంగళ స్వరూపమై కనిపించాడు. శ్రీకాకుళంలోని బలగ నాగావళి తీరంలో వెలసిన శ్రీబాల త్రిపుర కాలభైరవ పీఠంలో దత్తాత్రేయునికి గురువారం అభిషేకాలు చేశారు. – శ్రీకాకుళం కల్చరల్



నాటుసారా అక్రమ రవాణా అరికట్టాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పూర్తిస్థాయిలో నాటుసారా తయారీ కేంద్రాలు లేకుండా చూడడమే కాకుండా, వాటి అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన నెలవారీ సమీక్ష సమావేశంలో భాగంగా సెబ్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు, సరిహద్దు ప్రాంతాల నుంచి రవాణా అవుతున్న అక్రమ మద్యాన్ని అడ్డుకట్ట వేయాలని, వీటి రవాణా కేంద్రాలపై పూర్తి సమాచారాన్ని సేకరించి వ్యూహాత్మకంగా దాడులు నిర్వహించాలన్నారు. నాటుసారా తయారీ, ఉత్పత్తి, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. వాహన తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాని నియంత్రించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై కళాశాలల విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించడమే కాక గిరిజన ప్రాంతాల్లో నాటుసారా వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలని తెలిపారు. అనంత రం పలు కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన పది మంది సిబ్బందికి జేడీ వి.నాగమణికంఠ ప్రశంసా పత్రా లు అందించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కేపీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి



హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల 'జగనన్న సచివాలయం కన్వీనర్స్, గృహసారథి' (జేసీఎస్) కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 35 అసెంబ్లీ కోఆర్డినేటర్లు, 9,567 సచివాలయ కన్వీనర్లు, 1,07,916 గృహ సారథులు ఉంటారు.

జిల్లా జైలు సందర్శన

గార: అంపోలులోని జిల్లా జైలును జైళ్ల శాఖ కోస్తాంధ్ర రీజియన్ డీఐజీ ఎం.రవికిరణ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా జైలు రికార్డులను పరిశీలించిన ఆయన ఖైదీల గదులు, వంట శాల, లైబ్రరీ, ఖైదీలు సాగు చేస్తున్న పలు పంటలను పరిశీలించారు. మహిళా ఖైదీల గదులను పరిశీలించారు. రికార్డులు నిర్వహణ బాగుందని, పంటలు సాగు చేసి కూరగాయలను తినేందుకు ఉపయోగించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు సూపరింటెండెంట్ షేక్ నబీఖాన్, జైలర్లు దివాకర్ నాయుడు, ఉదయభాస్కరరావు, డిప్యూటీ జైలర్ రామకృష్ణ తదితరులున్నారు.

ఖోఖో పోటీల పరిశీలకునిగా భాస్కర్

ఎచ్చెర్ల క్యాంపస్: జేఎన్‌టీయూ కాకినాడలో ఈ నెల 8 నుంచి 12 వరకు జరగనున్న సౌత్‌జోన్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు పరిశీలకునిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ భాస్కర్‌ను నియమిస్తూ ఢిల్లీకి చెందిన అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు గురువారం భాస్కర్‌ను అభినందించారు.

శిశువు మృతితో ఆందోళన



మృతశిశువు వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మగ శిశువు మృతి కలకలం రేపింది. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మరణించాడని శిశువు కుటుంబ సభ్యులు ఆరోపించగా, తమ పొరపాటు లేదని వైద్య సిబ్బంది అంటున్నారు. సీదిగంగుపేటకు చెందిన దేరబద్ర కల్యాణిని మొదటి కాన్పు కోసం బుధవారం సాయంత్రం నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. రాత్రంతా పరిశీలనలో ఉంచి సాధారణ ప్రసవం రాకపోవడంతో గురువారం వేకువజామున ఆపరేషన్ చేసి బిడ్డను తీశారు. అప్పటికే బిడ్డ ఉమ్మనీరు తాగడంతో కొద్ది క్షణాలకే మృతి చెందింది. ఈ విషయంలో సిబ్బంది జాప్యం వల్లే శిశువు మృతి చెందిందని కల్యాణి భర్త హరీష్, సోదరుడు సాయి ఆరోపించారు. ఇంతలో బంధువులు కూడా ఘర్షణకు దిగడంతో సూపరింటెండెంట్ జయశ్రీ నచ్చజెప్పారు. సాధారణ ప్రసవం కాకపోవడంతో ఆపరేషన్ చేశామని, బిడ్డ కడుపులో ఉన్నప్పుడే ఉమ్మనీరు తాగడం వల్ల మృతి చెందినట్లు స్పష్టం చేశారు. కాగా, ఈ ఘటనపై శిశువు తండ్రి హరీష్ నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సహ పరిశోధన సంచాలకునిగా జోగినాయుడు



డాక్టర్ జోగినాయుడు

శ్రీకాకుళం రూరల్: నైరా వ్యవసాయ కళాశాలలో సహ పరిశోధన సంచాలకునిగా డాక్టర్ జి.జోగినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు లో వ్యవసాయ పరిశోధకునిగా పనిచేశారు. 29 ఏళ్లుగా వ్యవసాయశాఖ పరిశోధనలు, బోధనా రంగంలో అనుభవం కలిగి వ్యక్తి సహ పరిశోధన సంచాలకునిగా బాధ్యతలు స్వీకరించడంతో అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

అట్టహాసంగా

పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

- ప్రారంభించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్
- హాజరైన పది కళాశాలల విద్యార్థులు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్:

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని, విద్యార్థులు చదువుతో పాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల మైదానాల్లో మూడు రోజుల పాటు జరగనున్న శ్రీకాకుళం ప్రాంతీయ స్థాయి అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఎమ్మెల్యే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు పెరేడ్ నిర్వహించారు. అనంతరం క్రీడాకారుల నుంచి ఎమ్మెల్యే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లోనూ సత్తాచాటి రాష్ట్ర, జాతీయస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి క్రీడాకారులు ఉన్నారని, వీరిలో ప్రతిభా నైపుణ్యం వెలికితీసేందుకు అంతర కళాశాలల పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం సాంకేతిక విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. స్థానిక పరిశ్రమల్లోనూ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. కళాశాలల ప్రగతికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కాగా, ఈ పోటీల్లో శ్రీకాకుళం ప్రాంతీయ పరిధిలో 10 కళాశాలలకు చెందిన 441 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఆరు గేమ్స్, 13 స్పోర్ట్స్ ఈవెంట్‌లలో క్రీడాకారులు తలపడనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పి.ఆదిలక్ష్మి, రణస్థలం జెడ్పీటీసీ టి.సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి చినరాజు, వెంకన్నగారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హాజరైన క్రీడాకారులు



వాలీబాల్ క్రీడలో తలపడుతున్న క్రీడాకారులు



హోరాహోరీగా కబడ్డీ పోటీ

బెంతొరియాలను ఎస్టీలుగా గుర్తించాలి

- ఏకసభ్య కమిషన్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ వినతి



ఏకసభ్య కమిషన్ సభ్యుడు రిటైర్డు శామ్యూల్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: జిల్లాలోని ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అధిక సంఖ్యలో నివసించే బెంతొరియా కులస్తులు ఎస్టీ స్టేటస్ పొందేందుకు గల అవకాశాలను పరిశీలించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ మేరకు బెంతొరియా కులానికి సంబంధించి వాస్తవ పరిస్థితులు పరిశీలించడానికి విచ్చేసిన ఏక సభ్య కమిషన్ సభ్యుడు, రిటైర్డు ఐఏఎస్ అధికారి ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కొక్కిలిపుట్టుగలో బెంతొరియాల జీవన పరిస్థితులు అధ్యయనం చేసేందుకు గురువారం మధ్యాహ్నం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెంతొరియాలు కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో నివాసముంటున్నారని, వీరు ఎస్టీ సర్టిఫికెట్లు పొందలేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. . వీరి పిల్లలు ఎటువంటి కులధృవీకరణ పొందలేక, చదువులకు దూరమవుతూ దూరప్రాంతాల్లో పనులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. వీరి వాస్తవ పరిస్థితిని పరిశీలించి ఎస్టీ స్టేటస్ కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, తహసీల్దార్ ఎస్.హైమావతి, సీడాప్ కార్పొరేషన్ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, బెంతొరియా కుల ప్రధాన కార్యదర్శి శివ బిసాయి, రజనీకుమార్ దొళాయి, భాస్కర్ దొళాయి, అనాది దొళాయి, దేవరాజ్‌సాహు తదితరులు పాల్గొన్నారు.

బండి భద్రంగా నడపండి



మాట్లాడుతున్న డీటీసీ శ్రీదేవి

శ్రీకాకుళం రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను భద్రంగా నడపాలని జిల్లా ఉప రవాణాశాఖాధికారి సీహెచ్ శ్రీదేవి సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాలలో గురువారం రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనచోదకులు ముఖ్యంగా యువత హెల్మెట్ విధిగా ధరించి బైక్ నడపాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాల బారిన పడటమే కాకుండా కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోతాయని గుర్తు చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతా ఇన్‌స్పెక్టర్లు ఆర్.శంకరరావు, శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్‌డీసీల నియామకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదోన్నతులు పొందిన తహసీల్దార్లను అడహక్ పద్ధతిపై జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా ఎం.సుమబాలను కేఆర్‌సీసీ శ్రీకాకుళం ఎస్‌డీసీగా, పి.మురళీకృష్ణను ఎస్‌పీసీఎల్‌సి కొవ్వాడ ఎస్‌డీసీగా నియమించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరే అభ్యర్థులు తత్కాల్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ గార పగడాలమ్మ గురువారం తెలిపారు. ఈ నెల 8లోగా మీసేవా/ఏపీ ఆన్‌లైన్‌లో సాధారణ ఫీజుతోపాటు అపరాధ రుసుంగా పదో తరగతికి రూ.400, ఇంటర్మీడియెట్‌కు రూ.500 అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

దూర విద్యా పరీక్షల్లో చూసి రాతలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్యా పరీక్షల్లో చూసి రాతల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. గత నెల 28 నుంచి జరుగుతున్న దూర విద్యా యూజీ వార్షిక పరీక్షల్లో భాగంగా గురువారం మాస్ కాపీయింగ్ చోటు చేసుకుంది. ఒకే గదిలో 60 మంది విద్యార్థులు సెల్‌ఫోన్లు, పుస్తకాలతో పరీక్షలు రాస్తూ బరి తెగింపు చర్యలకు పాల్పడ్డారు. అయితే పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు హెల్పింగ్ పేరిట కొంత మంది ఇన్విజిలేటర్లు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాలకు చెందిన దిగువ స్థాయి సిబ్బంది ఒకరు ఇన్విజిలేటర్లతో రాయబారం చేస్తూ ఒక్కో విద్యార్థి నుంచి ఒక్కో పరీక్షకు 500 నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇదేమీ కొత్త వ్యవహారం కాదని, చాలాకాలంగా జరుగుతోందని కూడా కొందరు చెబుతున్నారు.

సొంత స్థలమిచ్చి.. ఆక్రమణలు తొలగించి..

- స్ఫూర్తిగా నిలుస్తున్న మూలిపాడు సర్పంచ్ వెంకటరావు



మూలిపాడులో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మందస: ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా ఆక్రమించడానికే ప్రాధాన్యమిస్తున్న తరుణంలో ప్రజలకు మంచి చేయాలన్న తలంపుతో ముందుగా తన స్థలమిచ్చి స్ఫూర్తిగా నిలుస్తున్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు. మందస మండలంలోని మూలిపాడు పంచాయతీకి కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా రహదారి ఉండడంతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు రూ.82లక్షలు మంజూరు చేశారు. అప్పటికే రోడ్డు ఆక్రమణలకు గురవ్వగా.. ముందుగా వెంకటరావు సుమారు మూడు సెంట్ల సొంత స్థలాన్ని రోడ్డు నిర్మాణానికి అందజేశారు. అనంతరం ఆక్రమణలు తొలగించి, రహదారి నిర్మాణం పూర్తి చేయించారు. కాగా, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి కూడా ఆటంకం ఏర్పడింది. గ్రామం సమీపంలోని పెద్దచెరువు వద్ద ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మించడానికి ప్రయత్నాలు చేయగా.. అప్పటికే ఆక్రమణదారులు ప్రతిఘటించారు. అధికారులు, పోలీసుల సాయంతో ఆక్రమణలు తొలగించిన వెంకటరావు రూ.10లక్షలతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం కూడా నిర్మించారు. దీంతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రత్యేకంగా అభినందించి మూలిపాడును ఆదర్శంగా తీసుకోవాలని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చెప్పారు. కలెక్టర్, జేసీ, ఆర్డీఓలు కూడా మూలిపాడులో పర్యటించి సర్పంచ్ చేస్తున్న అభివృద్ధిని కొనియాడారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ మంత్రి అప్పరాజు, అధికారుల ప్రోత్సాహంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానన్నారు.

సెంచూరియన్ నాలెడ్జ్ వెహికల్ ప్రారంభం



నాలెడ్జ్ వెహికల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు సెంచూరియన్ యూనివర్సిటీ రూపొందించిన నాలెడ్జ్ వెహికల్‌ను గురువారం శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన చదువుతోపాటు ఉపాధి, ఉద్యోగాలకు కల్పనలో సెంచూరియన్ యూనివర్సిటీ తనదైన ముద్ర వేస్తుండటం అభినందనీయమన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ మేనేజర్ శాసనం ఫల్గుణరావు మాట్లాడుతూ నాలెడ్జి వెహికల్ ద్వారా వ్యవసాయంలో అధునాతన పరికరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. సెంచూరియన్ వర్సిటీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం పలు కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ మెకానికల్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి అఖిల భరత్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత గుంటూరు



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



ప్రపంచస్థాయి కబడ్డీ ఆటగాడు ప్రదీప్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

పాతపట్నం: పాతపట్నం మార్కెట్ కమిటీ యార్డ్ ఆవరణలో ప్రదీప్ యువసేన, సింహా అకాడమీ బేనియా సింహా ఆధ్వర్యంలో నర్వల్ కబడ్డీ స్పోర్ట్స్ అకాడమీ రెండు రోజులుగా నిర్వహించిన కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. తెలంగాణ నుంచి నిజాంపేట, జీడిమెట్ల జట్లు రాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి గుంటూరు, శ్రీకాకుళం, పాతపట్నం మోడల్ కాలేజీ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో గుంటూరు ప్రథమ, నిజాంపేట ద్వితీయ, జీడిమెట్ల జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ప్రపంచ కబడ్డీ ఆటగాడు ప్రదీప్ నర్వాల్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా గేమ్స్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లు ఆచంట సుబ్బారావు, పి.జీవన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బెనియా సింహాచలం, తెలంగాణ నర్వల్ అకాడమీ కోచ్ రమేష్ నర్వాల్, యోగేష్ నర్వల్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండాల అర్జునరావు, పాతపట్నం నీలమణిదుర్గ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, కోడూరు సర్పంచ్ పనుకు మోహనరావు, గిరిజన నాయకుడు గరాడి అప్పన్న, సత్యసుమ, ఎన్.నారాయణరావు, షేక్ సత్య సుల్తాన్, బి.దేవి, పాతపట్నం ఎస్సై కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం



బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సంఘ అధ్యక్షుడికి స్థలం పట్టా అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: అన్నివర్గాల ప్రజానీకానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని శిష్టకరణ, విశ్వబ్రాహ్మణ, గాయత్రి బ్రాహ్మణ, క్రిస్టియన్, ఎస్సీ కుల సంఘాలతో పాటు జైభీమ్ యువజన సంఘానికి రెండున్నర సెంట్లు చొప్పున కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గురువారం స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద స్థల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. అన్ని కులాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. కుల వృత్తులు అంతరిస్తున్న తరుణంలో వాటిని నమ్ముకొని జీవిస్తున్నవారికి చేయూతనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బలివాడ రాజేష్ శర్మ, శిష్టకరణ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కె.వి.రమణమూర్తి, విశ్వబ్రాహ్మణ పంచవృత్తుల సంఘం అధ్యక్షుడు కటకం నాగేశ్వరరావు, తొగరాం సర్పంచ్, స్పీకర్ సతీమణి తమ్మినేని వాణీసీతారాం, మాజీ కౌన్సిలర్లు జె.కె.వెంకుబాబు, దుంపల శ్యామలరావు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అత్యుత్తమ మానవ వనరులు

- మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ప్రపంచానికి అవసరమైన మానవ వనరులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తయారవుతారని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీర్ఘకాల లక్ష్యంతో పనిచేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం పలాసలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తొలి ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలాస తప్పితే రాష్ట్రంలో అన్ని చోట్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండేవని, వైఎస్సార్ సీపీ వచ్చాక కాలేజీ కల సాకారమైందన్నారు. అమ్మఒడి, నాడు–నేడు, విద్యాదీవెన, వసతి దీవెన, డిజిటల్ లైబ్రరీలు, నూతన కళాశాలలు ఏర్పాటు వంటి చర్యలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తున్నట్లు వివరించారు. ఆంగ్ల విద్యతో ప్రపంచాన్ని శాసించే మానవ వనరులుగా తయారుకావాలని సీఎం ఆశిస్తున్నారని, ఆయన తపన అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం నమ్మవద్దని హితవుపలికారు. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జాబ్ క్యాలెండర్‌కు మించి 1.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. త్వరలో ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాల్లో 12 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రకటించారు.

మార్చిలో భావనపాడు పోర్టుకు శంకుస్థాపన.. జిల్లాకే తలమానికంగా నిలిచే భావనపాడు పోర్టుకు మార్చిలో సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారని మంత్రి ప్రకటించారు. రూ.రెండువేల కోట్లతో చేపట్టే ఈ పనులను రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ బళ్ల గిరిబాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇచ్ఛాపురం సీఐ ఈశ్వరప్రసాద్

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా ఇచ్ఛాపురం సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆర్ ఈసీహెచ్ ఈశ్వరప్రసాద్, శ్రీకాకుళం సీసీఎస్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.వి.రమణ గురువారం ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలియజేశారు.

'మెరుగ్గా పని చేయాల్సిందే'



సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: విధి నిర్వహణలో బాధ్యతతో కూడిన పనితనాన్ని ప్రదర్శించని వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి హెచ్చరించారు. గురువారం ఆమె స్థానిక కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో వైద్యుడు కచ్చితంగా సమయపాలన పాటించాలని, అలాగే ఎన్‌సీడీ, పీఎంవీవై, ఆర్‌సిహెచ్, హెచ్ఎంఐఎస్, ఎఫ్ఆర్ఎస్, యుఐపి, ఎంసిహెచ్ సర్వీసెస్ విషయంలో కచ్చితత్వం పాటించాలన్నారు. వీటి లక్ష్యసాధనలో వైద్యులు కీలక పాత్ర వహించాలన్నారు. నాడు–నేడు పనుల్లో భాగంగా పలు ఆస్పత్రుల్లో అద్భుత మార్పులు రానున్నాయని, ఈ పనుల నివేదికలపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ తులసి పాల్గొన్నారు.